# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# సూర్యప్రభ

( తెలుగు సినిమా 1950 డిసెంబర్ నుంచి పునర్ముద్రితం)




సినిమా ప్రేక్షకులకు సూర్యప్రభతో పరిచయం 'మాలిని' చిత్రం తర్వాత కలిగిందే కాని సినిమా పరిశ్రమతో ఎంతో కొంత సంబంధం వున్న మాకందరికీ సూర్యప్రభ చిరపరిచితురాలు. ఆంధ్రమహిళా సభలో సూర్యప్రభ బెనారిస్ మెట్రిక్యులేషన్ పరీక్షకి చదవటం దగ్గర్నించి, ఆమె నాటకాలలో నటించడం వరకూ మేము చూస్తూనే వున్నాం.

అందాల తార అనే పేరు తెచ్చుకున్న శ్రీమతి పుష్పవల్లి చెల్లెలు సూర్యప్రభ. అందువల్లే సూర్యప్రభతో మాకందరికీ చాలా కాలం నించీ పరిచయం కలిగింది.

సూర్యప్రభ కూడా పెంటపాడులోనే జన్మించింది. ఆమె తండ్రి పేరు కందాళ తాతాచారి. 1930వ సంవత్సరంలో జననం. ఆమె అక్క పుష్పవల్లి సినిమా నటన వృత్తిగా స్వీకరించటం సూర్యప్రభ జీవితంలో

ముఖ్యపరిణామం తీసుకొచ్చింది. చిన్నతనంలోనే అక్కతో బాటు మద్రాసుకి వచ్చేసిందీమె.

సినిమారంగంతో ఎటువంటి సంబంధం లేని, సినిమా నిర్మాణం గురించి ఏమీ తెలియని వుత్సాహవంతులయిన యువతీ యువకులకు సినిమా పరిశ్రమ గురించి కొన్ని అభిప్రాయాలు వుంటాయి. కావలసినంత డబ్బు, మోటారుకార్లు; సోఫాలతో, తివాసీలతో, వెండివస్తువులతో నిండిన వైభవంగా వుండే భవనాలు; పత్రికల్లో తమ ఫోటోలు; ప్రజలు తండోపతండాలుగా అభిమానంతో తమ దర్శనం కోసం నిరీక్షించటం, సినిమా నిర్మాతలు, నటీనటులతో తమతో సన్నిహితంగా వుండటం, ఎలక్ట్రిక్ దీపాలతో, కళాకాంతులతో వెలిగే, సినిమా స్టూడియోలు; సినిమా పరిశ్రమ గురించి చాలా మందికి యిటువంటి అభిప్రాయాలుంటాయి.

సినిమా పరిశ్రమతో పరిచయం వుండి; సినిమా మనుష్యులతో నిత్య సంబంధం వున్న సినిమా నిర్మాణం గురించి తెలుసున్న సూర్యప్రభకి ఎన్నడూ యిటువంటి అభిప్రాయాలు లేవనే చెప్పాలి.

బుకింగ్స్ లేని ఆర్టిస్టులు పడే తిప్పలూ; డబ్బు ఇవ్వని నిర్మాతలతో నటీనటులు పడే అష్టకష్టాలు; వ్యక్తిగత దూషణలతో నిండే సినిమా పత్రికలు; మేకప్ వేసుకుని ఎండలో, ఎండకన్నా తీవ్రమైన ఎలక్ట్రిక్ దీపాల్లో గంటల తరబడి నిలబడడం; యివన్నీ సూర్యప్రభకి తెలిసిన విషయాలే.

నటీమణిగా ఖ్యాతి సంపాదించుకొనటం వల్ల కలిగే భౌతిక, ఆర్థిక లాభాలూ, మానసిక ఆనందమూ ఆమెకి తెలుసు. నటీమణిగా విజయాన్ని సంపాదించలేకపోతే కలిగే చిక్కులు, అసంతృప్తితో కలిగే సంక్షోభమూ; దురభిమానంతో కలిగే బాధ ఆమెకి పూర్తిగా తెలుసు. ఇందువల్లే పదిహేనో ఏడువరకూ సినిమాల్లో నటించటానికి సూర్యప్రభ ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. చిన్నతనంలోనే సినిమాల్లో చేరాలని సూర్యప్రభ వుత్సాహపడి వుంటే, పరిశ్రమలో పరపతి వున్న శ్రీమతి పుష్పవల్లి ఆ అవకాశం అప్పుడే లభింపచేసి వుండేది.

'నటన'లో సూర్యప్రభ మొదటి అనుభవం రంగస్థలం మీదే. 1944 వ సంవత్సరంలో ఆంధ్రమహిళా సభ వారు 'అనార్కలి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఆ నాటకంలో సూర్యం (మేమంతా చనువుగా యిలా పిలుస్తాం) రాణి పాత్ర నటించింది.

నిజం అంగీకరించ వలసి వొస్తే ఆనాడు మేము ఎవరం కూడా సూర్యప్రభ సినిమా తారగా తయారవుతుందని అనుకోలేదు.

ఆమె విగ్రహం ఆకర్షణీయంగా వుంటుంది. పొడుగు పొడుక్కి తగ్గ లావు; యీ రెంటికీ తగ్గ అంగ సౌష్టవమూ; సన్నని నడుము; వెడల్పాటి కళ్ళు; తీర్చి దిద్దిన ముఖరేఖలూ, కళకళలాడే మొహమూ; యీమెలో ఆకర్షణలు. కలుపుగోరుతనంగా వుండి, అపరచితులను కూడా సన్నిహితులుగా చేసుకోవడం యీమెకి బాగా చాతనవును. అయినప్పటికీ యీమెకి ఆత్మాభిమానం కొంచెం ఎక్కువే. ఎవరయినా ఆమెని పల్లెత్తు మాట అంటే సంహించదు. స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో టీచర్ ఒక రోజున సూర్యప్రభ ఆలస్యంగా వొచ్చినందుకు కొంచెం గట్టిగా కోప్పడేటప్పటికి చరచర నడుచుకుంటూ స్కూల్లోంచి వెళ్లిపోయింది.

ఆంధ్రమహిళ సభలోనే శ్రీమతి సామ్రాజ్యం వద్ద నాట్యం నేర్చుకోవటం ప్రారంభించింది. తర్వాత శ్రీ వేదాంతం రాఘవయ్య గారి వద్ద నేర్చుకున్నది.

సూర్యప్రభ ప్రారంభంలో తమిళ సినిమాలో నటించింది. 'మిస్ మాలిని' ఆమె మొదటి చిత్రం. అక్క చెల్లెళ్ళు యిద్దరూ యీ చిత్రంలో నటించారు. తర్వాత చిత్రం 'చక్రధారి'. తెలుగు సినిమాలో మొదటి సారి స్వతంత్రా వారి 'ద్రోహి'లో కనిపించింది. ఆ చిత్రంలో ఈమె నటించలేదు. కంపెనీ ఎంబ్లంగా నిలబడ్డది. ఈమె మొదటి చిత్రం ప్రతిభావారి 'లక్ష్మమ్మ'. తిలోత్తమలోను, వినోదా ప్రొడక్షన్స్ వారి చిత్రంలోనూ, 'మంగళ' లోనూ ఈమె నటిస్తున్నది.

శ్రీమతి అంజలీదేవి సినిమాల్లో ప్రవేశించినపుడు, డాన్సుచేసే నర్తకి పాత్రలు ఆమెకి ప్రత్యేకించబడ్డాయి. కేవలమూ డాన్సు చేయటమే కాక, నటించడం కూడా ఆమెకి చాతనవును అని గ్రహించిన తర్వాత అంజలీ దేవిని ముఖ్యపాత్రలకి తీసుకోవడం ప్రారంభించారు. అంజలీ దేవి ఖాళీ చేసిన స్థానాన్ని సూర్యప్రభ ఈనాడు ఆక్రమించింది.

డాన్సు చేయవలసిన పాత్రలు సూర్యప్రభకి ప్రత్యేకిస్తున్నారు ఈనాడు. అయినప్పటికీ అంజలీదేవిలాగే సూర్యప్రభకూడా ప్రథమ శ్రేణి నటీమణుల జాబితాలోకి త్వరలో చేరవచ్చునని ఆశించవచ్చు.

ఈమె చాలా తమిళ చిత్రాల్లో కూడా నటిస్తున్నదీనాడు. తెలుగు మనిషి అయిన సూర్యప్రభకి ముందు తమిళులు తారాపథాన్ని అందిస్తున్నారు. కనీసం అదే సమయానికి తెలుగు సినిమాల్లోనూ ఈమెకి యింకా ప్రాముఖ్యం వొస్తుందని ఆశపడుతున్నాము.

★★★

*అదనపు సమాచారం:*

ఈ వ్యాసంలో ఆశించినట్లు తర్వాతి రోజుల్లో సూర్యప్రభ పెద్దగా రాణించలేదు. తర్వాత కొన్ని సంవత్సరాలకి సూర్యప్రభ గారిని వేదాంతం రాఘవయ్యగారు వివాహం చేసుకున్నారు. వారి సంతానమే ఒకనాటి దక్షిణాది చిత్రాల హీరోయిన్ శుభ. కృష్ణ హీరోగా నటించిన గూడుపుఠాణి లాంటి తెలుగు చిత్రాల్లో కూడా హీరోయిన్‌గా నటించారు ఈ శుభ. ప్రముఖ హిందీ తార రేఖకి సూర్యప్రభ పిన్ని ఔతారు.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS